క్లుప్తంగా

కూలీలు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో

కెరమెరి: ఉపాధి హామీ పథకంలో సక్రమంగా పనులు చేసి కూలీలు ఆర్థికంగా ఎదగాలని ఎంపీడీవో క్రిష్ణారావు, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య అన్నారు. మండలంలోని జోడే ఘాట్, చిన్న, పెద్ద పాట్నాపూర్, శివగూడ గ్రామాల్లో కొనసాగుతున్న పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీ పనికి వెళాలన్నారు. ప్రభుత్వం గతంలో కూలి రూ.278 చెల్లిస్తుండగా ఇప్పుడు రూ. 300కు పెంచిందన్నారు. కార్యదర్శి, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

శ్రీరామనవమి వేడుకలకు ఆహ్వానం



ఆహ్వానపత్రం అందజేస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా జిల్లాకేంద్రంలోని జన్కాపూర్ రామాలయంలో ఈనెల 17న శ్రీరాముని కల్యాణానికి రావాలని డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్‌కు నిర్వహణ కమిటీ సభ్యులు గురువారం ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ వేడుకలకు అవసరమైన సాయం అందజేయనున్నట్లు తెలిపారు. నిర్వహణ కమిటీ సభ్యులు శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై రాములు

భీమారం: మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిలో భీమారం వద్ద గురువారం ఎస్సై బి.రాములు నేతృత్వంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వాహన ధ్రువపత్రాలు పరిశీలించారు. ఈ మేరకు ఎస్సై మాట్లాడుతూ.. మహారాష్ట్ర నుంచి తెలంగాణ రాష్ట్రానికి సిర్పంచ మీదుగా అధిక మొత్తంలో వాహనాల రాకపోకలు కొనసాగిస్తుంటాయని తెలిపారు. అనుమానిత వ్యక్తులను వాహనాల్లో ఎక్కించుకోవద్దని వాహనదారులకు సూచించారు. తనిఖీల్లో స్థానిక పోలీసులతో పాటు సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

జైపూర్: మండలంలోని మిట్టపల్లి గ్రామంలో గురువారం అటవీశాఖ ఆధ్వర్యంలో ఉపాధిహామీ కూలీలకు అడవిలో జరుగుతున్న అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడవిలో అగ్ని ప్రమాదాల వల్ల అటవీ జంతువులకు కలిగే నష్టాలను వివరించారు. అడవిలో అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అటవీ వన పాలకులు విజయలక్ష్మి, అటవీ రక్షకుడు రమేశ్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

బెల్లంపల్లి: బెల్లంపల్లి బజారు ఏరియాలో గురువారం సింగరేణి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శాంభవి ఐ విజన్ సెంటర్ ఆవరణలో నిర్వహించిన శిబిరానికి ప్రజల నుంచి స్పందన లభించింది. 60మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 5 గురికి గుర్తించి కంటి ఆపరేషన్ కోసం హన్మకొండలోని శరత్ మ్యాక్సి విజన్ ఆపరేషన్‌కు సిఫారసు చేశారు. మరో ఏడుగురిని బెల్లంపల్లి లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రికి రెఫరల్ చేశారు. కార్యక్రమంలో కంటి పరీక్ష నిపుణుడు కొంకటి అంజయ్య, సింగరేణి లయన్స్ క్లబ్ జోనల్ చైర్‌పర్సన్ రాయమల్లు, సింగరేణి లయన్స్ క్లబ్ సెక్రెటరీ వంగల చక్రపాణి, సభ్యులు పెద్ది రాజేందర్, నల్మాస్ సంతోష్, చిప్పి అజయ్‌కుమార్, సిబ్బంది, వృద్ధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్



కెరమెరి: సుల్తాన్‌గూడ ఈద్గా వద్ద నమాజ్ చేస్తున్న ముస్లింలు



బెజ్జూర్‌లో ముస్లింల ప్రార్థనలు



సిర్పూర్ (టి): ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

దహెగాం/సిర్పూర్(టి)/కెరమెరి/బెజ్జూర్/కౌటాల/వాంకిడి/ రెబ్బెన/లింగాపూర్: జిల్లావ్యాప్తంగా రంజాన్ వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం ముస్లింలు ఈద్గాల వద్దకు చేరుకుని సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈద్గాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కెరమెరి:పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ..



రెబ్బెన: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



దహెగాం మొట్లగూడలో ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు



కెరమెరిలో..



కెరమెరి: ఈద్గా వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై, పోలీసులు



సిర్పూర్ (టి): శుభాకాంక్షలు తెలుపుతున్న హిందూ, ముస్లింలు



రెబ్బెన: బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై చంద్రశేఖర్, తదితరులు

కల్వర్టుకు రక్షణ గోడలు ఏవి?



మోతిపటార్ వాగుపై రక్షణ గోడలు లేని కల్వరు

లింగాపూర్: మండలంలోని గోపాల్‌పూర్ సమీపంలో కల్వర్టు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. మోతిపటార్ గ్రామ సమీపాన పెద్ద వాగుపై గతేడాది జిల్లా కలెక్టర్ పర్యటించారు. గ్రామస్తులకు రాకపోకలకు ఇబ్బందిగా ఉండటంతో రూ.2 లక్షలతో కల్వర్టు నిర్మించారు. కాని రక్షణ గోడలు నిర్మించకపోవడంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించేలా ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టాలని వాహనాదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా పాఠశాల గోడ



కౌటాల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల గేట్ పై గోడ ప్రమాదకరంగా ఉంది. ఇటీవల కాంట్రాక్టర్ కంకర టిప్పర్‌ను పాఠశాల ఆవరణలో తీసుకెళ్తుండగా పై భాగంలో ఉన్న గోడకు టిప్పర్ తగిలి పగిలింది. ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. జెడ్పీ, ప్రాథమిక పాఠశాలల్లో దాదాపు ఐదు వందల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

రామాలయ కమిటీని ఎన్నుకోవాలి

రెబ్బెన: గోలేటిలోని కోదండ రామాలయం కమిటీని గ్రామస్తుల మధ్య ఎన్నుకునేలా చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి ఏరియా గోలేటి జనరల్ మేజర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కోదండ రామాలయంలో కమిటీ ఎన్నికలను గత 30 ఏళ్లుగా ఆలయం వద్దనే భక్తుల సమక్షంలో నిర్వహించారన్నారు. ఈ ఆనవాయితీని కొనసాగించాలన్నారు. సొల్లు లక్ష్మి, గోలం విలాస్, కేసరి ఆంజనేయులు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బస్టాండ్ లేక తిప్పలు



దుకాణం ఎదుట వేచిచూస్తున్న ప్రయాణికులు

- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- చెట్లు, కిరాణ షాపుల వద్ద నిరీక్షణ
- పట్టించుకోని అధికారులు

కెరమెరి: మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. ఏళ్లుగా వారు పడరాని పాట్లు పడుతున్నారు. ఇతర గ్రామాల నుంచి వచ్చే ప్రజలు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. అయినా బస్టాండ్ నిర్మించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని సుమారు 156 గ్రామాలు ఉన్నాయి. అందులో సుమారు 100 గ్రామాలకు పైగా ప్రజలు కెరమెరిలో జరిగే వారసంతకు, ఇతర రోజుల్లో ఇక్కడకు వస్తుంటారు. వచ్చినవారు కూర్చుందామంటే బస్టాండ్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో కిరాణా షాపు, చెట్ల వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. మండల కేంద్రం కావడంతో ప్రతీరోజు అనేకమంది వస్తుంటారు. కాని నీడ లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ కూర్చోవడంతో దుకాణాల యజమానులు వెళ్లగొడుతున్నారు.

మూత్రశాలలు కరువు

ఇతర గ్రామాలకు వెళ్లేందుకు ప్రయాణికులు బస్సుల్లో వెళ్తుంటారు. ఆయా చోట్ల బస్టాండ్ లేకపోవడంతో మూత్రశాలలకు వెళ్లాలంటే వారు ఇబ్బంది పడుతున్నారు. ఆసిఫాబాద్ నుంచి ఉట్నూర్ వరకు మరెక్కడ బస్టాండ్ లేవు. బస్టాండ్ లేకపోవడంతో జైనూర్‌లో రహదారిపైనే బస్సులు నిలుపుతారు. ఆసిఫాబాద్ నుంచి ఉట్నూర్ వెళ్లాలంటే 70 కి.మీ దూరం. ఒంటికి వెళ్లాలంటే ప్రయాణికులు బిగపట్టాల్సి వస్తోంది. గతంలో పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు సమస్యను విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. మరోవైపు రోడ్లున్నా ప్రాంతాల్లో బస్సులు కూడా ఆర్టీసీ అధికారులు నడపకపోవడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు కెరమెరిలో బస్టాండ్ తోపాటు మూత్రశాలలు నిర్మించాలని మండల వాసులు, ప్రయాణికులు కోరుతున్నారు.

బస్టాండ్ నిర్మించాలి



దుకాణం ఎదుట కూర్చున్నా. ఎక్కడ నీడలేకపోవడంతో ఇక్కడే గంటల తరబడి ఉన్నా. బస్టాండ్ ఉంటే ఎంతో బాగుండేది. అధికారులు పట్టించుకుని వెంటనే నిర్మించేలా చర్యలు చేపట్టాలి.

– మడపచి చిన్ను, చింతకర్ర

ఇబ్బందిగా ఉంది



మండలంలో మూత్రశాలలు లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. గ్రామం అవతల ఉన్న పెద్దవాగు వద్దకు వెళ్లాల్సి వస్తుంది. బస్సులు నిలిపే ప్రాంత సమీపంలో మూత్రశాలలు నిర్మించాలి.

– కుమురం బొజ్జు, కరంజివాడ

ఉన్నతాధికారుల దృష్టికి..



కెరమెరిలో బస్టాండ్‌తోపాటు మూత్రశాలలు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమే. బస్సులు నిలిపే ప్రాంత సమీపంలో ఎక్కడ కూడా స్థలం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– క్రిష్ణారావు, ఎంపీడీవో, కెరమెరి

ఆలయ నిర్మాణానికి రూ.50వేల విరాళం

దండేపల్లి: మండలంలోని మాకులపేటలో నూతనంగా శివాలయం నిర్మిస్తున్నారు. ఇందుకుగాను జన్నారం మండలం రాంపూర్‌కు చెందిన నూతి చంద్రయ్య రూ.50వేలను గురువారం విరాళంగా అందించారు. ఈ సందర్భంగా అతడికి మాకులపేట గ్రామస్తులు ధన్యవాధాలు తెలిపారు.

జ్యోతిబా పూలేకు ఘన నివాళి



ఆసిఫాబాద్: నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు



వాంకిడి: పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తూ..



కౌటాల: కన్నెపల్లిలో..



ఆసిఫాబాద్: జైభీమ్ సంఘం ఆధ్వర్యంలో..



కెరమెరి:నివాళిలర్పిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

ఆసిఫాబాద్: జిల్లావ్యాప్తంగా మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి, చిత్రపటం వద్ద పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. దళిత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిబాపూలే అని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు పేర్కొన్నారు. ఆయన 197 జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ చౌరస్తా వద్ద ఆయన విగ్రహానికి మాలీ సంఘం ఆధ్వర్యంలో రాజకీయ, కుల సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయసాధనకు కృషిచేయాలని విశ్వ ప్రసాదరావు పేర్కొన్నారు. మాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రవీందర్, జిల్లా అధ్యక్షుడు శంకర్, బాలేశ్వర్‌గౌడ్, విశ్వనాథ్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కేశవరావు, అంబేద్కర్ సంఘం నాయకులు తిరుపతి, నాయకులు ఆదె బాబురావు తదితరులు పాల్గొన్నారు.

- జిల్లా కేంద్రంలో బీసీ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ వద్ద జ్యోతిబాపూలే జయంతి వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూప్‌నర్ రమేశ్, నాయకులు బాలేశ్, మారుతి, ప్రణయ్, లుంబినీ దీక్ష భూమి అధ్యక్షులు మనోహర్, కొలాం సంఘం నాయకులు ఆత్రం భీమ్‌రావు, మడావి జలపతి రావు, పిప్రి సాయి, సంఘ నాయకులు పాల్గొన్నారు.
- జై భీమ్ సేన కమిటీ ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జాడి అశోక్, దుర్గం సుధాకర్, జాడి కృష్ణాజీ, చంద్రి పెంటయ్య పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలో మండల మాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జ్యోతిబాపులే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్ రావ్ ఉన్నారు. స్థానిక బుద్ధ విహార్ భవనంలో మహార్ సంఘం ఆధ్వర్యంలో, గ్రామాల్లో జయంతిని నిర్వహించారు. ఎంపీపీ విశ్వనాథ్, మాలి సంఘం మండల అధ్యక్షుడు గంగారం, మాజీ సర్పంచులు శ్రీనివాస్, రమేష్, నిహారిక, సునంద పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: మహాత్మాజ్యోతిరావు పూలే త్యాగాలను మరువలేమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. కోసిని గ్రామంలోని జ్యోతిబాపూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, విశ్రాంత ఉద్యోగుల సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు నివాసంలో మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి, జ్యోతిబాపూలే బాయ్స్ పాఠశాలలో ప్రిన్సిపాల్ మంగ ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాలి సంఘం గ్రామ అధ్యక్షులు బాబురావు, హన్మంతు, పాండు తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: గోలేటిలో బీసీ ఐక్య సంఘర్షన సమితి ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, రాష్ట్ర నాయకుడు మల్లయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్, నాయకులు సాగర్ గౌడ్, శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోపాటు ఖమాన, కోమటిగూడ, ఎనోలి, ఖిరిడి గ్రామాల్లో జ్యోతిబాపూలే జయంతిని వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆయన విగ్రహం వద్ద నాయకులు నివాళులర్పించారు. మాలి సంఘం మండల అధ్యక్షుడు బాబురావు, మాలి సంక్షేమ సంఘం నాయకులు నారాయణ, మెంగాజీ, అశోక్, సెండె వాసు, కృష్ణ, సుధీకర్, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలో జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, మాలీ సంఘం అధ్యక్షుడు కావ్‌డే తుల్సిరాం, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, గ్రామ పటేల్ సోనేరావు, నాయకులు నాగు, ఉత్తం నాయక్, సెండే నారాయణ, శ్యాంరావు, సోంజి, ఎల్లప్ప, కుసుంబ్‌రావు, వేణు, వినేశ్ తదితరులు ఉన్నారు.

జార్జిరెడ్డి చరిత్ర పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి



నివాళులర్పిస్తున్న శ్రీకాంత్, విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: ఉస్మానియా యూనివర్సిటీ గోల్డ్‌మెడల్ గ్రహీత కామ్రేడ్ జార్జిరెడ్డి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో జార్జిరెడ్డి 52వర్ధంతి సందర్భంగా గురువారం జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయమైన విద్య, సమసమాజ స్థాపనకు విద్యార్థుల హక్కుల కోసం అనేక ఉద్యమాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జార్జిరెడ్డి స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.